

'సాదాబైనామా'లకు మోక్షమెప్పుడో..?

● మూడేళ్లపాటు పట్టించుకోని గత ప్రభుత్వం ● జిల్లావ్యాప్తంగా 35,580 దరఖాస్తులు

● కొత్త ప్రభుత్వంపై రైతుల ఆశలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

సాదా బైనామాల ద్వారా భూములను కొనుగోలు చేసిన వారికి పట్టాలు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో స్వీకరించిన దరఖాస్తులను మూడేళ్ల పాటు పట్టించుకోలేదు. దీంతో ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రయోజనాలను రైతులు కోల్పోవాల్సి వస్తున్నది. వీటిని కొత్త ప్రభుత్వం పరిశీలిస్తుందనే ఆశతో రైతులు ఎదురుచూస్తున్నారు. తమ అవసరాల కోసం భూములను విక్రయించుకోవాలనుకుంటున్న వారికి ఆ అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు, ప్రధాని కిసాన్ సమ్మాన్ నిధి, ఇతరత్రా సబ్సిడీ పథకాలు అందడం లేదు. 2014 జూన్ 2వ తేదీలోపు సాదా బైనామాల ద్వారా భూములను కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్లు చేసుకోలేని వారి భూములను ఆర్‌వోఆర్ చేసి పట్టా దారు పాసుపుస్తకాలను జారీచేసేందుకు ప్రభుత్వం 2020 అక్టోబరు 1 నుంచి 31వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఆ తర్వాత నవంబరు 10వ తేదీ వరకు పొడిగించింది. మాన్యువల్‌గా గాకుండా మీసేవా కేంద్రాల ద్వారా దరఖాస్తులను స్వీకరించింది. దీంతో జిల్లావ్యాప్తంగా 35,580 దరఖాస్తులు వచ్చాయి.

ఇందులో అంతర్గాం మండలంలో 903, పాలకుర్తి మండలంలో 1,642, ధర్మారం మండలం లో 2,294, ఎలిగేడు మండలంలో 1,215, కమాన్‌పూర్ మండలంలో 532, రామగుండం మండలంలో 412, రామగిరి మండలంలో 1,243 దరఖాస్తులు వచ్చాయి. అలాగే జూలపల్లి మండలంలో 1,220, ముత్తారం మండలంలో 2,834, కాల్వశ్రీరాంపూర్ మండలంలో 5,670, ఓదెల మండలంలో 3,557, పెద్దపల్లి మండలంలో 5,939, మంథని మండలంలో 4,563, సుల్తానాబాద్ మండలంలో 3,556 దరఖాస్తులు వచ్చాయి. 2020 అక్టోబరు 24వ తేదీన ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను తీసుకరాగా, నవంబరు 2వ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది.

అందకుండాపోతున్న ప్రభుత్వ ప్రయోజనాలు..

సాదా బైనామా దరఖాస్తులను పరిశీలించి, ఆ భూములకు హక్కులను కల్పిస్తూ రైతులకు పట్టా దారు పాసుపుస్తకాలను జారీ చేయాల్సిన ప్రభుత్వం కోర్టులో కేసు కారణంగా పెండింగులో పెట్టింది. కోర్టులో దాఖలైన పిటిషన్‌కు గత ప్రభుత్వం కౌంటర్ పిటిషన్ వేయని కారణంగానే జాప్యం దరఖాస్తులు పరిశీలనకు నోచుకోలేదు.

దరఖాస్తులన్నీ తహసీల్దార్ కార్యాలయాల్లో మూలుగుతున్నాయి. ఆ దరఖాస్తులను పరిశీలించని కారణంగా రైతులు ప్రభుత్వం అమలుచేస్తున్న రైతుబంధు పథకం ద్వారా వచ్చే సాయం, ప్రధాని కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా అందే సాయాన్ని కోల్పోతున్నారు. అలాగే రైతుబీమాకు నోచుకోవడం లేదు. బ్యాంకుల ద్వారా వడ్డీ లేని పంట రుణాలను, ఇతరత్రా రుణాలను పొందలేక పోతున్నారు. సాదాబైనామా దరఖాస్తులను ఎప్పుడు పరిశీలిస్తారా అని ఎదురుచూస్తున్న రైతులు రెవెన్యూ కార్యాలయాలకు వెళ్లి ఆరా తీస్తున్నారు. గత ప్రభుత్వం దరఖాస్తులను పరిశీలించక పోవడంతో భూములను విక్రయించిన పట్టాదారులు గానీ, వారి వారసులు వివాదాలు సృష్టిస్తున్నారని రైతులు అంటున్నారు. ఈ భూములు తమవేనని, తాము విక్రయించ లేదంటూ తిరగబడుతున్నారని చెబుతున్నారు. సాదాబైనామా దరఖాస్తులను పరిశీలించడంలో మరింత జాప్యం జరిగితే మాత్రం రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాలు దక్కక పోగా, భూములపై వివాదాలు పెరిగే ప్రమాదం ఉంది. ప్రస్తుత ప్రభుత్వమైనా స్పందించి వెంటనే సాదాబైనామా దరఖాస్తులను పరిశీలించి పట్టాదారు పాసు పుస్తకాలను జారీ చేయాలని రైతులు కోరుతున్నారు.



నేడు మంథని మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస సమావేశం

- క్యాంపు నుంచి నేరుగా సమావేశానికి కౌన్సిలర్లు హాజరు..



మంథని మున్సిపల్ కార్యాలయం

మంథని, ఫిబ్రవరి 15:మంథని మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్‌లపై మెజార్టీ సభ్యులు ఇచ్చిన ఆవిశ్వాసం నోటీస్‌పై శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. ఈ సమావేశానికి ప్రిసైడింగ్ అధికారిగా మంథని ఆర్డీవో హనుమా నాయక్‌ను నియమించారు. చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌పై మున్సిపల్‌లోని మెజార్టీ సభ్యులు అదనపు కలెక్టర్‌కు అవిశ్వాసం నోటీస్ ఇచ్చిన విషయం విదితమే. మున్సిపల్‌లోని మొత్తం 13 కౌన్సిలర్లల్లో 2 ఇద్దరు కాంగ్రెస్, 11మంది బీఆర్‌ఎస్ పార్టీల నుంచి గెలుపొందారు. మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు మంత్రిగా ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తుండటంతో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఏడుగురు కౌన్సిలర్లు శ్రీధర్‌బాబు సమక్షంలో ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ మారిన వెంటనే 9 మంది సంతకాలతో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాసం నోటీస్ అదనపు కలెక్టర్‌కు సమర్పించారు. అనంతరం అవిశ్వాసం ప్రకటించిన కౌన్సిలర్లు క్యాంపునకు తరలివెళ్లారు. క్యాంపు నుంచి నేరుగా వారు మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం జరిగే సమావేశానికి హాజరుకానున్నట్లు సమాచారం. దీంతో శుక్రవారం జరిగే అవిశ్వాసం ప్రత్యేక సమావేశంపై స్థానికుల్లో ఉత్కంఠ నెలకొంది.

మేడారం జాతరకు ఖని ఆర్టీసీ డిపో నుంచి 135 బస్సులు

- డిపో మేనేజర్ నాగభూషణం



మాట్లాడుతున్న నాగభూషణం

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 15: మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు గోదావరిఖని ఆర్టీసీ డిపో నుంచి 135 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ నాగభూషణం చెప్పారు. గురువారం ఆయన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 25 వరకు జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం 135 బస్సులు ఏర్పాటు చేసినట్లు, ఇందులో గోదావరిఖని డిపో నుంచి 38 ఆర్టీసీ, 15అద్దె బస్సులు, భాన్సువాడ డిపోకు చెందిన 55బస్సులు, కంటోన్మెంట్ డిపోకు చెందిన 15అద్దె బస్సులు, సిరిసిల్లా డిపోకు చెందిన 40బస్సులను నడపనున్నట్లు, పెద్దపల్లి బస్టాండ్ నుంచి జగిత్యాల డిపోకు చెందిన 113బస్సులు, సిరిసిల్లా డిపోకు చెందిన 40బస్సులు, కోరుట్ల డిపోకు చెందిన 60బస్సులు మొత్తం 203బస్సులను నడపనున్నట్లు తెలిపారు. అదే విధంగా గోలివాడ జాతరకు గోదావరిఖని డిపో నుంచి 12బస్సులను నడపనున్నట్లు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించినట్లు, తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు కలిగి ఉండాలని పేర్కొన్నారు. గోదావరిఖని బస్టాండ్‌లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో తాగునీటి సౌకర్యం, విద్యుత్ దీపాలంకరణ, శానిటేషన్, వెహికిల్ ట్రాకింగ్ సిస్టంను, ఎంక్వైరీ కౌంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, 140మంది ఆర్టీసీ వాలంటీర్లు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, ఇతర సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. గోదావరిఖని ఆర్టీసీ డిపో, లైటింక్లయిన్‌కాలనీ నుంచి పెద్దలకు రూ.370, పిల్లలకు రూ.200, పెద్దపల్లి బస్టాండ్ నుంచి పెద్దలకు రూ.380, పిల్లలకు రూ.210 టికెట్ ధరగా నిర్ణయించినట్లు తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరాలని ఆయన కోరారు.

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 15: మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు 193 ఆర్టీసీ బస్సులను నడిపిస్తున్నట్లు పెద్దపల్లి పాయింట్ ఇన్‌చార్జీలు సునీతా, విజయమాధురిలు పేర్కొన్నారు. స్థానిక బస్టాండ్ ఆవరణలు గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈనెల 18 నుంచి 25 వరకు బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఇక్కడున్న బస్సులు సరిపోవని జగిత్యాల, సిరిసిల్ల, కోరుట్ల, సంగారెడ్డి, రాణిగంజ్ డిపోల నుంచి బస్సులు తీసుకువస్తున్నట్లు వివరించారు. గతంలో ఆర్టీసీ బస్టాండ్ నుంచి మేడారం జాతరకు వెళ్లే వారని ఇప్పుడు బస్టాండ్ అసౌకర్యంగా ఉండడంతో ప్రభుత్వ ఐటీఐ మైదానం నుంచి బస్సులు మేడారం వెళ్తాయని భక్తులు ఐటీఐ నుంచే బస్సు ఎక్కాల్సి ఉంటుందని , జాతర నుంచి వచ్చిన భక్తులు బస్టాండ్‌లోనే దిగాల్సి ఉంటుందన్నారు. ప్రయాణీకుల కోసం ఐటీఐలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు వారు పేర్కొన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం వర్తిస్తుందని ఏదేని ఐడీ ప్రూఫ్ చూపించాలని సూచించారు.

ఉచిత ప్రయాణం నేపధ్యంలో ఈ ఏడాది సుమారు 100 బస్సులు అదనంగా వేసినట్లు తెలిపారు. ఫుల్‌టికెట్లు 380 రూపాయలుండగా, హాఫ్ టికెట్లు 210 రూపాయల ధర నిర్ణయించినట్లు తెలిపారు. ఈ బస్సులు మంథని, కాటారం, ఘన్‌పూర్, జంగలపల్లి, త్వాడాయి మీదుగా మేడారం చేరుకుంటాయన్నారు. సమ్మక్క-సారలమ్మ గద్దెల వరకు ఆర్టీసీ బస్సులు తీసుకెళ్తాయని, ప్రైవేట్ వాహనాలు సుమారు నాలుగైదు కిలోమీటర్ల దూరంలో దించుతాయన్నారు. ఆర్టీసీ బస్సు ప్రయాణమే సురక్షతం అని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, రాములు, వెంకటేశ్వర్లు, కవిత, అహ్మద్, రాజేశ్వర్, చారిలున్నారు.

ఎస్సారెస్పీ ఆయకట్టుకు సాగునీరందేలా చర్యలు

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



మల్లాపూర్, కుమ్మరికుంట గ్రామాల్లో కాలువను పరిశీలిస్తున్న కలెక్టర్

ధర్మారం, ఫిబ్రవరి 15 : ఎస్సారెస్పీ కింద సాగు చేస్తున్న పంటలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులకు సూచించారు. గురువారం మధ్యాహ్నం ధర్మారం మండలం మల్లాపూర్ డి83/బీ హెడ్ రెగ్యులేటర్‌ను, రెవెళ్ల కాకతీయ డి83 ఆఫ్ టేక్ వద్ద గల కాలువను కలెక్టర్ పరిశీలించారు. రైతులకు సాగునీటి విడుదల అంశంలో అందించిన సమాచారం ప్రకారంగా కట్టుదిట్టంగా ఆయకట్టుకు సాగు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. నీటిని వృథా కాకుండా నేరుగా పంటలకు అందేలా ఎప్పటికప్పుడు కాలువలను పరిశీలించాలని ఆయన సూచించారు. గతంలో మంచి ఫలితాలు అందించిన ఉత్తమమైన పద్ధతులను వినియోగించాలని ఆయన అధికా రులకు సూచనలు ఇచ్చారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి, నీటి పారుదల శాఖ ఎస్ఈ సత్యరాజ్‌చంద్ర, సుల్తానాబాద్ ఈఈ ప్రసాద్, పెద్దపల్లి ఈఈ శ్రీనివాస్ అధికారులు ఉన్నారు.

ఆయకట్టుకు సాగునీరందించేందుకు చర్యలు

జూలపల్లి, ఫిబ్రవరి 15:ఎస్సారెస్పీ డి83 కాలువ ద్వారా వస్తున్న సాగునీరు వృథా కాకుండా చివరి ఆయకట్టు భూములకు అందించేలా సంబంధిత అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజామిల్‌ఖాన్ ఆదేశించారు. మండలంలోని కుమ్మరికుంట గ్రామం వద్ద గురువారం ఎస్ఆర్ఎస్పీ డి83 మెయిన్ కాలువ, ఎస్కేప్‌లోని నీటిని కలెక్టర్ ముజామిల్‌ఖాన్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. సాగునీరు అందక ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

- సీనియర్లు జూనియర్లకు గైడ్‌లాగా వ్యవహరించాలి - రామగుండం సీపీ శ్రీనివాసులు



ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీ, అధికారులు

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 15: ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులు బంగారు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాసులు అన్నారు. గురువారం రామగుండం మెడికల్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు తమ భవిష్యత్‌ను నిర్మించడంలో కళాశాల క్యాంపస్ కీలక పాత్ర పోషిస్తుందని, అలాంటి విద్యార్థి భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కళాశాల విద్యార్థుల మధ్యం స్నేహపూరిత వాతావరణం ఉండే విధంగా చూసుకోవాలన్నారు. సీనియర్లు, జూనియర్లు అని కాకుండా సీనియర్లు జూనియర్లకు గైడ్‌లా వ్యవహరిస్తూ స్నేహితులుగా పెద్దన్న పాత్ర పోషిస్తూ జూనియర్లకు మార్గదర్శకంగా ఉండాలన్నారు. రామగుండం పోలీసుల ఆధ్వర్యంలో కమిషనరేట్ పరిధిలో అన్ని విద్యా సంస్థలలో ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని, దీని కోసం ఒక ప్రత్యేక వింగ్‌ను ఏర్పాటు చేసినట్లు సీపీ చెప్పారు. విద్యార్థులు ర్యాగింగ్ వంటి మహమ్మారికి దూరంగాల ఉండాలని, గమ భవిష్యత్ నిర్మాణం కోసం కళాశాలను వినియోగించుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. తాను చార్జ్ తీసుకున్న రోజే రామగుండం మెడికల్ కళాశాలలో ర్యాగింగ్ వార్తలు తనను కలిచి వేసిందని, భవిష్యత్‌లో విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే వారిపై ర్యాగింగ్ నిరోధక చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని సీపీ సున్నిహతంగా హెచ్చరించారు. రామగుండం మెడికల్ కళాశాలను ర్యాగింగ్ రహిత క్యాంపస్‌గా మార్చడానికి విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. అన్ని కళాశాలల్లో షీ టీమ్స్ బృందాలు ఏర్పాటుతో పాటు మఫ్టీలో పోలీసులు తిరుగుతూ బాడీ కెమెరాలతో నేర సంఘటలను రికార్డు చేయడం జరుగుతుందని, ఎవరైనా ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ చేసినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, నిరంతరం పోలీస్ నిఘాలో కళాశాలలు ఉంటాయని పేర్కొన్నారు.

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన సీపీ

ర్యాగింగ్ అనేది నేరం... అంటూ హెచ్చరిస్తూ ఉన్న వాల్ పోస్టర్‌ను సీపీ శ్రీనివాసులుతో పాటు మెడికల్ కళాశాల విద్యార్థులు, వైద్యుల సమక్షంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులతో ర్యాగింగ్‌కు పాల్పడబోమంటూ ప్రతిజ్ఞ చేయించారు. వైద్య విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ చేతన్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ జ్యోతి, గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు, లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ నుచ్చు శ్రీనివాస్, సీడీపీఓ కమలాకర్, షీ టీమ్ ఎస్ఐలు హైమ, రాజేంద్రప్రసాద్, గోదావరిఖని వన్‌టౌన్ ఎస్ఐలు శరణ్య, సుగుణాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించిన ఎమ్మెల్యే



మార్కెట్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 15: వ్యవసాయ మార్కెట్‌ను ఎమ్మెల్యే విజయరమణారావు గురువారం సందర్శించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ట్రేడర్లు, మల్లర్లతో సమావేశమై పలు సూచనలు ఇచ్చారు. తేమ శాతం ఎక్కువగా ఉన్న పత్తిని కొనుగోలు చేయాలని ట్రేడర్ల, జిన్నింగ్ మిల్లుల యాజమానులను సూచించారు. తేమ 14 శాతం ఉన్న కొనుగోలు చేయాలని, అలాగే రైతులు పెద్దమొత్తంలో పత్తిని తడిపి తీసుకురావద్దని సూచించారు. ప్రస్తుతం వ్యవసాయ మార్కెట్లో ఇద్దరు ట్రేడర్లు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, లైసెన్స్ ఉన్న ప్రతి ఒక్కరు పత్తి కొనుగోలు చేపట్టాలని స్పష్టం చేశారు. శాతం ఎక్కువగా ఉన్న పత్తిని మార్కెట్‌కు తరలించవద్దని, ఉదయం 8గంటల వరకే రైతులు మార్కెట్ తీసుకురావాలని గ్రామాల్లో ప్రచారం చేయాలని సూచించారు. మార్కెట్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా కొనుగోలు జరపాలన్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మెన్ జడల సురేందర్, మందల సత్యనారాయణరెడ్డి, నూగిళ్ళ మల్లయ్య, ఉప్పు రాజు, సందనవేన రాజేందర్, బూతగడ్డ సంపత్, సూత్రపు పరమేశ్వర్, అర్కుటి సంతోష్, మల్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నరోత్తమ్ రెడ్డి, సాంబిరెడ్డి, తదితరులు ఉన్నారు.

రామగుండం కమిషనరేట్‌లో 14మంది ఎస్సైల బదిలీ

కోల్‌సిటీ, ఫిబ్రవరి 15: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో 14మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఐజీ సుధీర్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. రామగుండం ట్రాఫిక్‌లో పని చేస్తున్న ఉదయ్ కిరణ్‌ను ఎన్‌టీపీసీకి, అక్కడ పని చేస్తున్న జీవన్‌ను వీఆర్‌లోకి, గోదావరిఖని వన్‌టౌన్‌లో పని చేస్తున్న స్వామిని బసంత్‌నగర్‌కు, అక్కడ పని చేస్తున్న వెంకటేష్‌ను వీఆర్‌లోకి, రామగుండం పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న వెంకటస్వామి అంతర్గాంకు, మందమర్రి పీఎస్‌లో పని చేస్తున్న చంద్రకుమార్‌ను లక్సెట్టిపేట ఎస్‌హెచ్‌వోగా, అక్కడ పని చేస్తున్న లక్ష్మణ్‌ను వీఆర్‌లోకి, మందమర్రి-2 ఎస్ఐగా పని చేస్తున్న రాజశేఖర్‌ను మందమర్రి ఎస్‌హెచ్‌వోగా, వీఆర్‌లో ఉన్న గుండేటి రాజీవ్‌వర్ధన్‌ను మంచిర్యాల 4వ ఎస్ఐగా, వీఆర్‌లో ఉన్న అప్పాని వెంకటకృష్ణను మంథని ఎస్‌హెచ్‌వోగా, అక్కడ పని చేస్తున్న కిరణ్ కుమార్‌ను వీఆర్‌లోకి, గోదావరిఖని టుటౌన్ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న మామిడాల చంద్రశేఖర్‌ను కమాన్‌పూర్ ఎస్‌హెచ్‌వోగా, కొమురం భీం ఆసిఫాబాద్ డీఎస్‌బీలో పని చేస్తున్న సందీప్‌కుమార్‌ను రామగిరి ఎస్‌హెచ్‌వోగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవాపూర్ ఎస్‌హెచ్‌వోగా పని చేస్తున్న పీబీఎస్ భవానిని కాళేశ్వరం ఎస్‌హెచ్‌వోగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

గోదావరిఖని ఎక్సైజ్ సీఐగా మంగమ్మ

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 15: గోదావరిఖని ఎక్సైజ్ సీఐగా మంగమ్మ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. కాగజ్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్‌లో పని చేస్తూ మంగమ్మను గోదావరిఖనికి బదిలీ చేయగా, ఇక్కడ పని చేస్తున్న సుంకరి రమేష్‌ను ఖమ్మం జిల్లా ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ సీఐగా బదిలీచేశారు. మంగమ్మకు ఎక్సైజ్ పోలీసులు పూలబొకే ఇచ్చి స్వాగతం పలికారు.

జాతీయ రహదారి భూసేకరణపై కేశనపల్లిలో గ్రామసభ



రైతులతో మాట్లాడుతున్న మంథని ఆర్డీవో

ముత్తారం, ఫిబ్రవరి 15: జాతీయ రహదారి నంబరు 163 నిర్మాణం కోసం భూసేకరణలో భాగంగా మండలంలోని కేశనపల్లిలో మంథని ఆర్డీవో వి హనుమ నాయక్ గురువారం గ్రామసభ నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో సభను ఏర్పాటు చేసి భూసేకరణ అవార్డు విచారణ నిర్వహించారు. భూమికి నష్టపరిహారం ఆర్ఎఫ్‌సీటీఎల్‌ఏఆర్ఆర్ 2013 చట్టం ప్రకారం చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుమన్, గ్రామపంచాయతీ స్పెషల్ అధికారి ఉదయ్ కుమార్, ఆర్ భవాని ప్రసాద్ శ్రీధర్, భూనిర్వాసితులు, ప్రజలు పాల్గొన్నారు. కాగా, రోడ్ల కోసం లక్షల రూపాయల భూములు కోల్పోలేమని భూములు ఇచ్చే ప్రసక్తి లేదని రైతులు తేల్చి చెప్పగా, తాము ప్రభుత్వ తరఫున వచ్చామని అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి పనుల కోసం చట్ట ప్రకారం నష్టపరిహారం చెల్లించి భూములు తీసుకుంటాయని ఆర్డీవో పేర్కొన్నారు.

సైబర్ నేరస్థులపై అప్రమత్తంగా ఉండాలి : ఏసీపీ కృష్ణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఏసీపీ కృష్ణ

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 15: సైబర్ నేరస్థులపై అప్రమత్తంగా ఉండాలని నూతనంగా వచ్చిన ఏసీపీ గజ్జి కృష్ణ సూచించారు. గురువారం పెద్దపల్లి ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మాట్లాడారు. వివిధ రకాల యాప్‌ల ద్వారా నేరస్థులు ఎరవేసి వివరాలు సేకరించి బ్యాంకు ఖాతాలను గుల్ల చేస్తున్నారని వివరించారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రత్యేక చొరవ చూపుతామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తూ నేరస్థులపైపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. సమస్యలుంటే నేరుగా పరిధిలోని పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళల రక్షణ కోసం షీ టీంలు అందుబాటులో ఉన్నాయని, ఎలాంటి సమస్యలు తలెత్తిన సంప్రదించాలని, అసాంఘీక కార్యక్రమాలు, అక్రమ దందాలు చేసేవారు మానుకోవాలని హెచ్చరించారు.

ర్యాగింగ్‌కు పాల్పడిన ముగ్గురు విద్యార్థుల సస్పెండ్

- హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు, భద్రత పెంపు

- రామగుండం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 15: రామగుండం మెడికల్ కళాశాలలో ఈనెల 13న జరిగిన ర్యాగింగ్ ఘటనలో ముగ్గురు సీనియర్ వైద్య విద్యార్థులను ఆరు నెలల పాటు కళాశాల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ర్యాగింగ్ కమిటీ నిర్ణయించినట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు తెలిపారు. ర్యాగింగ్ కమిటీ బుధవారం విచారణ చేపట్టిందని, ర్యాగింగ్‌కు పాల్పడిన తల్లిదండ్రులను, విద్యార్థులను పిలిపించి కౌన్సెలింగ్ చేశామని, కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం ఆరు నెలలు విద్యార్థులను కాలేజీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఆమె చెప్పారు. హాస్టల్‌లో ఇక నుంచి ఆకస్మిక తనిఖీలతో పాటు సెక్యూరిటీ సిబ్బందిని కూడా పెంచినట్లు చెప్పారు. విద్యార్థుల మధ్య స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పేందుకు ఇకనుంచి అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తామని ఆమె చెప్పారు.

దాడికి పాల్పడిన వ్యక్తుల రిమాండ్

చిగురుమామిడి,ఫిబ్రవరి15: మండలంలోని రేకొండ గ్రామానికి చెందిన ఎలకపల్లి రమేష్, ఎలకల పల్లి నవీన్ అనే వ్యక్తులపై కేసు నమోదు చేసి గురువారం రిమాండ్ చేసినట్లు ఎస్సై బండి రాజేశ్ తెలిపారు. ఇదే గ్రామానికి చేందిన కండె సాయికిరణ్ అనే వ్యక్తితో ఎలకపల్లి రమేష్, ఎలకపల్లి నవీన్‌లు డబ్బులు విషయంలో గొడవకు దిగారు. కత్తితో సాయికిరణ్‌పై దాడికి పాల్పడ్డారు. బాధితుడి తండ్రి కండె మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఇద్దరిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.

ముగిసిన తొలిదశ ప్రజాహిత యాత్ర

సిరిసిల్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం గ్రామాలకు అందిస్తున్న నిధుల లెక్కలు వినిపిస్తూ ప్రజాసమస్యలు తెలుసుకుంటూ ఎంతో ఉత్సాహంగా సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చేపట్టిన ప్రజాహిత యాత్ర గురువారం ముగిసింది. కొండగట్టు అంజన్న దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేసి మేడిపల్లి వద్ద ప్రారంభించిన ప్రజాహిత యాత్ర రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అగ్రహారం అంజనేయస్వామి దేవస్థానం వద్ద ప్రత్యేక పూజలతో ముగించారు. చివరి రోజు తంగళ్లపల్లి మండ ల కేంద్రం నుంచి సిరిసిల్ల జిల్లా కేంద్రం మీదుగా అగ్రహారం వరకు కొనసాగింది. సిరిసిల్లలో కొండా లక్ష్మణ్‌బాపూజీ, చాకలి ఐలమ్మ, గాంధీ, అంబేద్కర్, చేనేత విగ్రహాలకు పూలమాలలు వేశారు. ముగింపు సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేశారు. ఆరు రోజుల పాటు రెండు నియోజకవర్గాల్లో 13 మండలాలు, రెండు మున్సిపాలిటీలు, 81 గ్రామాల్లో యాత్ర సాగింది.

● బీఆర్ఎస్‌కు ఒక్కఎంపీ సీటు కూడా రాదు

ముగింపు సందర్భంగా బండి సంజయ్ విలేకరుల సమావేశంలో మాట్లా డారు. తెలంగాణలో బీఆర్ఎస్‌కు ఒక్క ఎంపీ సీటు కూడా రాదని, బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకోవాల్సిన ఖర్మ మాకేందని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా 400 సీట్లు బీజేపీకి రాబోతున్నాయని వివరించారు. మోదీ హవాను తట్టుకోలేక బీఆర్ఎస్, కాంగ్రెస్ కలిసి బీజేపీని దెబ్బ తీసేందుకు విషప్రచారం చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ, మున్సిపల్ మాజీ ఛైర్మన్ అడెపు రవీందర్, అల్లాడి రమేష్, ఎర్రం మహేష్, బర్కం వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.


సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బండి సంజయ్ ప్రజాహిత యాత్ర

గోదావరిలో పడి వ్యక్తి మృతి

వెల్గటూర్, ఫిబ్రవరి 15: కోటిలింగాల గోదావరిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. దండేపల్లి మండలం మ్యాదరిపేటకు చెందిన బత్తిని కమల్‌గౌడ్ (27) అనే యువకుడు తనకు డాటా ఎంట్రీ ఆపరే టర్ ఉద్యోగం వచ్చిందని చెప్పి ఇంటి నుంచి రూ.70 వేలు, బంధువుల దగ్గర రూ.44,500 తీసు కొని ఈ నెల 13న మధ్యాహ్నం టీఎస్ 09ఇసి3725 నంబ రు గల స్కూటీపై ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అదే రోజు రాత్రి తనకు వరుసకు అల్లుడైన ఆకుల పవన్‌కు తన మొత్తం డబ్బులు హ్యాక్ అయ్యాయని ఫోన్ చేసి చెప్పాడు. ఈ క్రమంలో బుధవారం కోటిలింగాల గోదావరిలో శవమై తేలాడు. తన దగ్గర ఉన్న డబ్బులు మొత్తం అయిపోవడంతో చేతిలో డబ్బులు లేకుండా ఇంటికి ఎలా వెళ్లాలో తెలియక గోదావరిలో దూకి ఆత్మహత్య కు పాల్పడినట్లు మృతుని తండ్రి బత్తిని మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భవనం పైనుంచి పడి ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి15: ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులోని డబల్‌బెడ్ రూం ఇళ్ల సముదాయంలో శ్రీగాద భాస్కర్ అనే వ్యక్తి గురువారం భవనం మొదటి అంతస్తు పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రగాయాల పాలయ్యాడు. అతన్ని కుటుంబీకులు, కాలనీవాసులు మండల కేంద్రంలోనీ ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గ్రామంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో భాస్కర్ తన కుటుంబీకులతో కలిసి మొదటి అంతస్తులో నివాసముంటున్నాడు. భవనం బాల్కనీ నుంచి కిందకు చూస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. భాస్కర్ పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

గంభీరావుపేట, ఫిబ్రవరి 15 : గంభీరావుపేట మండలం ముస్తాఫనగర్ గ్రామ సమీప వ్యవసాయ బావిలో దూకి లింగన్నపేటకు చెందిన బర్కుటం లక్ష్మి (65) అనే వృద్ధురాలు గురువారం ఆత్మహత్య చేసుకుంది. పోలీస్‌లు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగన్నపేటకు చెందిన లక్ష్మి భర్త ఎనమిదేళ్ల క్రితం చనిపోయాడు. ఉన్న ఒక కొడుకు మూగవాడు కావడంతో లక్ష్మి తరుచూ ఆవేదన చెందేది. కొడుకు గ్రామ సమీపంలో ఉన్న రైస్‌మిల్‌లో పనిచేస్తూ అక్కడే ఉండేవాడు. ఇంట్లో లక్ష్మి ఒంటరి జీవితం గడుపుతూ మనోవేదనతో మానసికంగా బాధపడుతూ ఉండేది. ఈ క్రమంలో లక్ష్మి మతిస్థిమితం కోల్పోయినట్లు ప్రవర్తించింది. ముస్తాఫనగర్ గ్రామ సమీపాన గల వ్యవసాయ బావిలో పడి మృతి చెందింది. మృతురాలు మరిది భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాంమోహన్ తెలిపారు.

రైతు మృతిపై వీడని మిస్టరీ

● సీపీకి ఫిర్యాదు చేసిన మృతుడి కుటుంబ సభ్యులు

గన్నేరువరం, ఫిబ్రవరి 15, మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన రైతు పంబాల కొమురయ్య(55) తన వ్యవసాయ క్షేత్రంలో బుధవారం అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ విషయమై గురువారం తిమ్మాపూర్ రూరల్ సీఐ స్వామి, గన్నేరువరం ఎస్ఐ చందా నరసింహారావుతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. బుధవారం రాత్రి మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టంకు తరలించగా గురువారం సాయంత్రం వరకు పోస్టుమార్టం చేపట్టలేదు. గుండ్లపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన వ్యవసాయబావి నుంచి మోటారును బయటకు తీసేందుకు తన తండ్రిని తీసుకెళ్లాడని అక్కడే విద్యుదాఘాతంతో తన తండ్రి మృతి చెందాడని ఆరోపిస్తూ మృతుడి కుమారుడు రాజశేఖర్ గురువారం సీపీకి ఫిర్యాదు చేశాడు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోస్టుమార్టం నివేదిక అందిన తర్వాత మృతికి గల కారణాలను వెల్లడిస్తామని ఎస్ఐ చందా నరసింహారావు తెలిపారు. చట్టప్రకారం చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.


కొమురయ్య (ఫైల్)

అనుమానాస్పదంగా సంచరిస్తున్న యువకుడిని చితకబాదిన గ్రామస్థులు

గొల్లపల్లి, ఫిబ్రవరి 15: మండలంలోని వెన్నుమట్ల గ్రామంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న అపరిచిత యువకుడిని పిల్లలను ఎత్తుకెళ్లే ముఠా సభ్యుడు అనుకుని గ్రామస్థులు చితకబాదారు. అనంతరం గొల్లపల్లి పోలీసులకు అప్పగించారు. యువకుడు కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేక తిరుగుతున్నాడని పోలీసుల విచారణలో తేలడంతో తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఎస్సై చిర్ర సతీష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. సిద్ధిపేట జిల్లా జూలపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్(25) కొంతకాలంగా మతి స్థిమితం సరిగా లేక హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ పిచ్చి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇటీవల స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. ఆరు నెలల క్రితం ఇంటిలో నుంచి అదృశ్యం కావడంతో యువకుడి తల్లిదండ్రులు అతని ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలో వెన్నుమట్ల గ్రామంలో యువకుడు అనుమానాస్పదంగా సంచరించడాన్ని గ్రామస్థులు గుర్తించారు. వారం రోజులుగా పిల్లలను ఎత్తుకెళ్లే ముఠా గ్రామాల్లో సంచరిస్తున్నట్లు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతుంది. దీంతో గ్రామస్థులు పిల్లలను ఎత్తుకెళ్లే ముఠాకు సంబంధించిన దొంగ అనుకుని యువకుడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. బాధిత యువకుడిని విచారించగా అతని మానసిక స్థితి సరిగా లేదని గుర్తించారు. అతని తల్లిదండ్రులకు సమాచారం అందించినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఎస్సై మాట్లాడుతూ వదంతులను సోషల్ మీడియాలో షేర్ చేయవద్దని సూచించారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

వీణవంక,ఫిబ్రవరి15:మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ నజీర (20) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం... నజీర మానసిక స్థితి సరిగాలేక పోవడం, అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు జమ్మికుంట ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తల్లి షేక్ షైదర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

వీణవంక,ఫిబ్రవరి 15: మండలంలోని మాల్లారెడ్డిపల్లి గ్రామ మానేరు వాగు నుంచి ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్నా ట్రాక్టర్ ను పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించినట్టు పోలీస్‌లు తెలిపారు.చల్లూరు గ్రామ చివరులో వాహనాలు తకిఖీలు చేస్తుండగా మాల్లారెడ్డిపల్లి గ్రామనికి చెందిన మేకల శ్రీనివాస్ ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణ చేస్తుండగా అతని పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.మండలంలో అనుమతులు లేకుండ అక్రమంగా ఇసుక రవాణ చేస్తే కటిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

ఏటీఎం దోపిడీకి పాల్పడిన నిందితుడి అరెస్టు

● పరారీలో మరో ముగ్గురు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 15: ఈ నెల 10న గోదావరిఖని గౌతమినగర్ హనుమాన్ గుడి వద్ద ఉన్న ఏటీఎంలో డబ్బులు దోచుకెళ్లిన ఘటనలో ప్రధాన నిందితుడు హకీముద్దీన్‌ను రామగుండం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఈ మేరకు రామగుండం సీఐ టీ ప్రవీణ్ కుమార్ అరెస్టు వివరాలను వెల్లడించారు. హర్యాన రాష్ట్రానికి చెందిన హకీముద్దీన్, సోకెంఖాన్, అమీర్‌ఖాన్, వసీంఖాన్‌లు ఈ నెల 10న అర్ధరాత్రి గౌతమినగర్‌లోని ఏటీఎంను గ్యాస్ కట్టర్‌తో కట్ చేసి అందులోని రూ.27,59,000లను దోచుకెళ్లారు. ఈ ఘటనపై రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుని హర్యాన రాష్ట్రంలో నిందితులు పారిపోతుండగా హకీముద్దీన్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు సీఐ తెలిపారు. మిగతా నిందితులు సోకెంఖాన్, అమీర్‌ఖాన్, వసీంఖాన్ పారిపోయారని, వీరిని పట్టుకోవడానికి బృందాలు గాలింపు చర్యలు చేస్తున్నట్టు తెలిపారు. నిందితున్ని పట్టుకోవడానికి కృషి చేసిన సిబ్బందిని పెద్దపల్లి డీసీపీ చేతన్ అభినందించారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ముగ్గురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 15 : మోతాదుకు మించి అధికంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ముగ్గురు వ్యక్తులకు కరీంనగర్ మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ జైలుశిక్ష, జరిమానా విధించారని కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎండీ సర్వర్ తెలిపారు. డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 22 మంది వాహనదారులను గురువారం కోర్టులో హాజరుపరచగా ఒక వ్యక్తికి 10 రోజులు, మరొకరికి 7 రోజులు, ఇంకొకరికి 3 రోజుల వంతున జైలు శిక్షతో పాటు ముగ్గురికి కలిపి 6 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. మిగతా 19 మంది వాహనదారులకు 33,500 రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు.

శుక్రవారం ● 16 ఫిబ్రవరి 2024

నివేదన



భద్రాచలానికి వచ్చే మార్గంలో దుమ్ముగూడెం (దూమగూడెం) అనే ఊరు ఉంది. దాని అవతలి ఒడ్డున ఉన్న చిన్న గుట్ట సమీపంలోనే జటాయువుకు, రావణుడికి యుద్ధం జరిగినట్టు రామాయణంలో ఉంది. ఆ గుట్ట దగ్గరే జటాయువుకు శ్రీరాముడు అంత్య సంస్కారాలు చేశాడు.

పంచవటి మనదే!

అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రాణప్రతిష్ఠ అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ శ్రీరామ వనవాస మార్గం గురించి వివరించారు. ఆ వివరాలకు సంస్కృత రామాయణంలో వాల్మీకి రచించిన దానికీ తేడా ఉంది. అయోధ్య నుంచి ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఉన్న భరద్వాజ ఆశ్రమానికి, మధ్యప్రదేశ్‌లోని చిత్రకూటానికి, మహారాష్ట్రలోని నాసిక్ దగ్గర ఉన్న పంచవటికి, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా లేపాక్షికి, కర్ణాటకలోని కిష్కింధకు, తమిళనాడులోని రామేశ్వరానికి, అక్కడి నుంచి శ్రీలంకకు శ్రీరాముడు పయనించాడనడం సరికాదేమో! ప్రధాని తన ప్రసంగంలో లేపాక్షి, నాసిక్‌లోని పంచవటుల గురించి ప్రస్తావించారే కానీ... దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచల రామాలయం సమీపంలోని పంచవటి గురించి కానీ, అసలు ఆ ఆలయం గురించి కానీ కనీసం ప్రస్తావించలేదు. ఇది తెలుగువారిని ఒకింత నిరాశకు గురిచేసిందనాలి. అయోధ్య నుంచి లంక దాకా శ్రీరాముడి ప్రస్థానం, తిరుగు ప్రయాణంలో అయోధ్యకు వస్తూ సీతకు రాముడు చూపించిన ప్రదేశాలు వావిలికొలను సుబ్బారావు (వాసుదాసు)గారి 'ఆంధ్ర వాల్మీకి రామాయణం' (మందరం) వ్యాఖ్యానంలో వివరంగా ఉన్నాయి.

అరణ్యాలకు బయలుదేరిన సీతారామలక్ష్మణులు తామసా నదీ తీరం, ఉత్తరకోసల దేశం, వేదశ్రుతి నది, గోమతీ నది, దక్షిణ కోసల దేశ సరిహద్దులు దాటి... గంగానదీ తీరంలోని శృంగబేరి పురాన్ని చేరారు. గుహుడి సాయంతో గంగను దాటి, గంగా యమున సంగమ స్థలిలోని భరద్వాజ ముని ఆశ్రమానికి వెళ్లారు. యమునను దాటి, నీలవన మార్గంలో పయనించి, మందాకినీ సరయూ నది దగ్గరలో ఉన్న చిత్రకూటం చేరారు. అక్కడ వాల్మీకిని చూశారు. చిత్రకూటంలో లక్ష్మణుడు పర్ణశాల నిర్మించాడు. భరతుడు చిత్రకూటానికి వచ్చి, వెళ్లాక... వారు అత్రి మహాముని ఆశ్రమానికీ, అనంతరం దండకారణ్యంలో ప్రవేశించి, విరాధుణ్ణి సంహరించి, శరభంగ మహర్షి ఆశ్రమానికీ, అటు నుంచి సుతీక్ష్ణాశ్రమానికీ, మాండకర్ణి ఆశ్రమానికీ ప్రయాణించారు. అగస్త్యుణ్ణి ఆయన ఆశ్రమంలో దర్శించుకున్నారు. పంచవటి అనే నివాస యోగ్యమైన స్థలం రెండు ఆమడల దూరంలో ఉందని అగస్త్యుడు సూచించాడు. అగస్త్యుడు చెప్పిన మార్గంలో వెళ్తూ, దారిలో ఒక మర్రి చెట్టు మీద ఉన్న జటాయువును రాముడు కలిశాడు. తరువాత సీతా లక్ష్మణ సమేతుడై పంచవటిని చేరుకున్నాడు. అక్కడ పర్ణశాల నిర్మించమని లక్ష్మణుడికి చెప్పాడు. లక్ష్మణుడు కుటీరాన్ని సిద్ధం చేశాడు. అవే ఇప్పటికీ భద్రాచలానికి 30 కిలోమీటర్ల దూరంలో ఎందరో భక్తులను ఆకర్షిస్తున్న పంచవటి, పర్ణశాలలు. భద్రాచలం సమీపంలో ఉన్నది పర్ణశాల కాదనీ, అది నాసిక్‌కు దగ్గరగా ఉందనీ చెప్పడం పూర్తిగా సత్యదూరం.

పంచవటి గోదావరీ తీరంలో ఉందనేది నిర్వివాదాంశం. అక్కడ గోదావరి ఉత్తరం నుంచి దక్షిణానికి పారుతూ ఉండాలి. ఎందుకంటే సీతాపహరణం తరువాత... సీతను రావణుడు తీసుకువెళ్ళినది దక్షిణ దిక్కుగానని మృగాలు, పక్షులు సూచించిన మేరకు... రామలక్ష్మణులు గోదావరీ తీరాన మొదట నైరుతి దిశగా వెళ్ళారు. తరువాత దక్షిణంగా వెళ్ళారు. గోదావరీ తీరంలో వారు జటాయువును చూశారంటే... గోదావరి నది జటాయువు పడిన స్థలం వరకూ... దక్షిణాభిముఖంగా పారుతూ ఉండాలి. జటాయువుకు గోదావరీ జలాలతో నివాపాలు (తిలోదకాలు) విడిచారు. అక్కడి నుంచి రామ లక్ష్మణులు తూర్పుగా వెళ్ళడానికి ఏరు అడ్డం వస్తుంది కాబట్టి... నైరుతి దిశగానే మూడు కోసుల దూరం పయనించారు. కొంత తూర్పుగా వెళ్తే కాని జటాయువు చెప్పిన దక్షిణ మార్గం కనిపించదు కాబట్టి... అక్కడి నుంచి మూడు కోసులు తూర్పుగా వెళ్ళారనుకోవాలి. అంటే అప్పుడు వారు.. ఇప్పటి భద్రాచలం దగ్గర, గోదావరి నదికి దక్షిణాన ఉన్నారు. అలా వచ్చారు కాబట్టి గోదావరి దాటవలసిన పని లేదు. ఆ కారణం వల్ల పంచవటి గోదావరి నదికి పడమటి తీరాన ఉందనే విషయం స్పష్టంగా అంగీకరించాలి. తూర్పున ఉన్నట్టయితే గోదావరి దాటే ఉండాలి. ఇప్పటి పర్ణశాలే యదార్థమయిన పంచవటి అయినా కావాలి. లేని పక్షంలో ఇప్పుడు అందరూ భావిస్తున్న పర్ణశాలకు ఎదురు ఒడ్డున, చక్కటి పంచవటి ఉండేదని మాత్రం నిర్ధారణగా చెప్పవచ్చు. నాసిక్ దగ్గర పంచవటి ఉన్నదనీ, అక్కడి నుంచి దక్షిణంగా రామ లక్ష్మణులు వెళ్ళారనీ చేసే వాదన రామాయణానికి విరుద్ధం. పంచవటి గోదావరీ నది పశ్చిమ తీరాన ఉందనడానికి స్థలం ఆధారంగా ఉంది. పర్ణశాలకు ఎదురుగా ఉన్న గుట్ట దగ్గర రావణాసురుడు తన రథాన్ని నిలిపాడని అంటారు. కారణం... సీతాదేవిని ఎత్తుకురాగానే రథం సిద్ధంగా ఉండాలి కాబట్టి. నదికి ఒక ఒడ్డున రథం, మరో ఒడ్డున సీత ఉంటే... సీతాపహరణం సాధ్యమయ్యేది కాదనుకోవాలి. కాబట్టి పడమటి దిక్కున ఉన్న పంచవటి దగ్గర సీతాపహరణం జరిగి ఉండాలి. అలాగే అక్కడికి సమీపంలోనే 'సీత గుట్టలు' అనే పెద్ద పర్వతం ఉంది. ఖరుడు యుద్ధానికి వచ్చినప్పుడు... రామలక్ష్మణులు అక్కడ ఉన్న కారణంగా ఆ గుట్టలకు ఆ పేరు వచ్చిందంటారు.

హంపీ... పంప ఒకటి కాదు...

ఇప్పటి హంపీయే అప్పటి పంప అనీ, అక్కడే పర్ణశాల ఉన్నదనీ అనడం కూడా సరికాదు. రామలక్ష్మణులు లంకకు వెళ్ళేటప్పుడు ఏ మార్గం నుంచి వెళ్ళినా, తిరిగి వచ్చేటప్పుడు... విమానంలో తక్కువ దూరంలో ప్రయాణించే విధంగా... లంక నుంచి సముద్రం దాటాక... రామేశ్వరం నుంచి అయోధ్యకు వెళ్ళారనేది అందరూ అంగీకరించినదే. అలాంటప్పుడు ఎడమ వైపు కిష్కింధ, కుడివైపున పంచవటి ఉండి ఉండాలి. ఆ మార్గానికీ నాసిక్‌కూ సంబంధమే లేదు. కాబట్టి పంచవటి... నాసిక్ కానే కాదు. కావడానికి వీల్లేదు. సీతారామలక్ష్మణులు చిత్రకూటం నుంచి దక్షిణంగా ఋక్షవంతానికి వచ్చి, పశ్చిమాభిముఖంగా నాసిక్‌ను చేరినట్టయితే... మార్గమధ్యంలో

> పంచవటికి దగ్గరలోనే పద్మ సరస్సు ఉందని 'వాల్మీకి రామాయణం' చెబుతోంది. అలాంటి పెద్ద చెరువొకటి ఉండేదని అక్కడ ఉండే కోయలు చెబుతూ ఉంటారు. ఆ చెరువుకూ, గోదావరికీ మధ్య పంచవటి ఉంది.

వింధ్య పర్వతాన్ని, నర్మద, తపతీ నదులను దాటి... విదర్భ మీదుగా ప్రయాణించవలసి ఉంటుంది. వాటిని వారు దాటినట్టయితే... వాల్మీకి తప్పకుండా రాసేవాడు. రామలక్ష్మణులు దక్షిణానికి వచ్చి, ఆ తరువాత ఆగ్నేయంగా కిష్కింధకు వచ్చారనడం రామాయణానికి ప్రత్యక్ష విరుద్ధమని చెప్పాలి. నిజానికి...వారు నైరుతి మూలగా, నైరుతిగా వెళ్ళి, కంబంధుణ్ణి చంపి, పడమరగా వెళ్ళి, పంప (తుంగభద్ర) చేరి, పడమరలో ఉన్న శబరి గుహకు వెళ్ళారు. జటాయువు గుట్ట దగ్గర నుంచి నైరుతికి వస్తేనే కిష్కింధకు రాగలరు. అలాకాకుండా ఆగ్నేయ మూలగా వెళ్ళి ఉంటే... సముద్రతీరానికి చేరేవారే తప్ప కిష్కింధకు కాదు. ఆగ్నేయమూలగా వారు ప్రయాణించారని రామాయణంలో ఒక్క మాటయినా లేదు.

సీతారామలక్ష్మణుల వనవాసం చివర్లో... సీతాపహరణం కోసం రావణుడు, మారీచుడు కలిసి దండకారణ్యంలోని రామచంద్రుడి ఆశ్రమానికి చేరుకున్నారని 'వాల్మీకి రామాయణం'లో ఉంది. పర్ణశాలకు ఉత్తరాన పర్వతాలు, తూర్పున గోదావరి, దక్షిణ, పడమర దిశల్లో అడవి ఉన్నాయి. రాముణ్ణి మారీచుడు పడమరగానే తీసుకువెళ్ళాడు. రావణుడు వెళ్ళాల్సింది దక్షిణ మార్గాన కాబట్టి... ఆ దోవలో రాముడు ఉండకూడదని మారీచుడు అలా చేశాడు. సీతను రావణుడు అపహరించుకుపోతున్నప్పుడు... పర్ణశాలకు మైలు దూరంలోని వృక్షం దగ్గర జటాయువు ఎదురయింది. రావణుడు, జటాయువు మధ్య యుద్ధం అయిదారు మైళ్ళ దూరంలోని దుమ్ముగూడెం దగ్గరున్న జటాయువు గుట్ట వరకూ సాగింది. రావణుడు సీతను ఎత్తుకొని, పర్ణశాల నుంచి బయలుదేరి, కిష్కింధ మీదుగా, పర్వతాలు, తటాకాలు దాటి, సముద్రాన్ని సమీపించి, లంకకు పోయాడనుకోవాలి. ఇవన్నీ పర్ణశాల ఎక్కడుందో తెలిపే అంశాలు.

సీతాన్వేషణలో భాగంగా రామలక్ష్మణులు క్రౌంచారణ్యం, మతంగవనం, పంపానది ఒడ్డున ఉన్న ఋశ్యమూక పర్వతం మీదుగా వెళ్ళారు. అప్పటివరకూ వారు దక్షిణ దిక్కుగానే ప్రయాణం చేశారు. శబరి ఆశ్రమానికి తూర్పు దిక్కులోనే పోవాలి కాబట్టి... వారు పడమరగా వెళ్ళి, తూర్పుకు తిరగాల్సి ఉంటుంది. నాసిక్ దగ్గర పంచవటి ఉన్నదనే వారి వాదనకు ఇది పూర్తిగా వ్యతిరేకం. ఆ తరువాత వారు కిష్కింధ వెళ్ళారు. రావణుడితో యుద్ధానికి వెళ్ళేదాకా ప్రస్రవణ పర్వతం మీద ఉన్నారు. కిష్కింధకు ఆగ్నేయంగా ఉన్న లంకకు పోతూ మహేంద్ర పర్వతం ఎక్కారు. రావణ వధ అనంతరం సీతా సమేతంగా అయోధ్యకు పుష్పక విమానం మీద తిరుగు ప్రయాణం కావడం... వనవాసంలో భాగం. ఆ తిరుగు ప్రయాణంలో ఈ ప్రదేశాలన్నీ సీతకు రాముడు చూపించడం కొసమెరుపు.

(వాసుదాసు గారి 'ఆంధ్రవాల్మీకి రామాయణం' (మందరం) ఆధారంగా)

● వనం జ్వాలా నరసింహారావు

పర్వదినం



జగత్ చైతన్యకారకుడు

*బ్రహ్మస్వరూపముదయే మధ్యాహ్నేతు మహేశ్వరః
సాయం సంధ్యే సదా విష్ణుం త్రయీమూర్తిర్దివాకరః*

సూర్యుడు త్రిమూర్త్యాత్మకుడు. ముల్లోకాలలోని ప్రాణులతో... త్రికాలాలలో పూజలు అందుకుంటున్న ప్రత్యక్ష దైవం. ఆదిత్యుడు, దివాకరుడు, సూర్యనారాయణుడు... ఇలా ఆయనకు ఎన్నో నామాలు. ఈ చరాచర జగత్తుకు వెలుగును, తేజస్సును ఆయన ప్రసాదిస్తాడు. అదితి-కశ్యపులకు ఆయన జన్మించిన రోజైన మాఘ శుద్ధ సప్తమి... 'రథసప్తమి'గా ప్రసిద్ధిచెందింది. ఉత్తర దిశగా సూర్యుడి గమనం ఈ రోజే ఆరంభమవుతుందని 'మత్స్యపురాణం' చెబుతోంది. ముప్పై మూడు కోట్ల మంది దేవతలు ఉన్నారని మనం చెప్పుకొంటున్నా... మనకు నిత్యం దర్శనమిచ్చే దైవం ఆదిత్యుడే. ఈ సృష్టిలో పన్నెండుమంది ఆదిత్యులు ఉన్నారనీ, సమస్త జీవజాలానికీ, సృష్టివిధానానికీ వారే ఆధారభూతులనీ 'భవిష్యపురాణం' చెబుతోంది. నవగ్రహాలలో మనకు కనిపించే ఏడు గ్రహాలను వారంలోని ఏడు రోజులకు పేర్లుగా పూర్వ ఋషులు నిర్ణయించారు. ఆదిత్యుని పేరిట ఆదివారాన్ని స్థిరపరిచారు.

సూర్యుడు మానవుల మనుగడకు ఆధారభూతుడు. కాంతికి, శక్తికి, చైతన్యానికి కారకుడు. సమస్త జ్ఞాన, విజ్ఞానాలకు అధిపతి. ఆయనను కర్మసాక్షిగా, స్థితికారకుడిగా పురాణాలు, ఇతిహాసాలు అభివర్ణించాయి. సూర్యుడి శక్తివల్లనే భూమండలంతో సహా ఇతర గ్రహాలు సంచరిస్తున్నాయి. ఆయనాలు, ఋతువులు ఏర్పడడానికి సూర్యగమన శక్తే కారణం. యజ్ఞాగ్నిగా సౌర శక్తిని మన ఋషులు దర్శించారు. సూర్య, భూగ్రహాల మధ్య ఉన్న సంబంధాన్ని విజ్ఞానపరంగా విశ్లేషించి... జ్యోతిష శాస్త్రాన్ని నిర్మించారు. మాసాలు, పక్షాలు, తిథులను నిర్దేశించి పంచాంగ శాస్త్రాన్ని ఆవిష్కరించారు. గ్రహాలు, రాశుల సంచారాలు, కలయికలను పరిశీలించి... వాతావరణ విజ్ఞానం అందించారు. ఇంతటి మహోన్నతమైన విజ్ఞానానికి ఆధారం సూర్యభగవానుడే.

ఆధ్యాత్మికంగా పరిశీలిస్తే.. 'అఘము' అంటే పాపం... 'మా' అంటే తొలగించడం. మాఘ మాసంలో వచ్చే సూర్యజయంతి రోజున ఆయనను అర్చిస్తే పాపాలన్నీ తొలగిపోతాయనేది శాస్త్రవచనం. రథసప్తమి నాడు ఉత్తరాభిముఖంగా... రథంలో సూర్యుడు పయనిస్తాడు. ఆ రథానికి ఒకటే చక్రం. దానికి పన్నెండు ఆకులు. అవి పన్నెండు మాసాలకు సంకేతం. ఆ రథానికి ఒకటే అశ్వం. 'ఏకో అశ్వోవహతి సప్తనామా' అని చెప్పింది ఋగ్వేదం. ఆ రథంలో అధిష్ఠితుడైన సూర్యుని కాంతి ఏడు వర్ణాలుగా... కిరణాలుగా ప్రసరితమవుతుంది. వాటినే ఏడు అశ్వాలుగా పరిగణిస్తారు. ఈ విశ్వమంతా ఆ కిరణాల విలాసమే. అవి ఆరోగ్యప్రదాలని, సూర్యోదయవేళ ఆ లేత కిరణాలు శరీరంపై సోకితే... శారీరక, మానసిక రుగ్మతలు తొలగిపోతాయని, సూర్యనమస్కారాలతో దారుఢ్యం కలుగుతుందనీ ఆయుర్వేద, యోగ శాస్త్రాలు చెబుతున్నాయి. ఆదిత్యుని ద్వాదశనామాలు పఠిస్తూ, సూర్యుణ్ణి ప్రార్థనలు చేస్తే... ఆరోగ్య, ఆధ్యాత్మిక ప్రయోజనాలు చేకూరుతాయన్నది పెద్దల మాట.

● ఆయపిళ్ళ రాజపాప

వేడుక

వన వేలుపుల మహా జాతర

గిరిజనుల ఆరాధ్య దేవతలుగా, ఆపదలో ఉన్నవారిని ఆదుకొని, వారి కష్టాలు తీర్చే వేలుపులుగా వాసికెక్కారు సమ్మక్క, సారలమ్మ. ఆ వనదేవతలకు నిర్వహించే జాతర... తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందింది. అంతేకాదు... ఇది ఆసియాలో అతి పెద్ద గిరిజన జాతర. మన దేశంలో కుంభమేళా తరువాత అత్యధికంగా భక్తులు హాజరయ్యే వేడుక. ఈ మహా జాతరకు ఇతర రాష్ట్రాల నుంచి కూడా గిరిజన, గిరిజనేతర భక్తులు భారీ సంఖ్యలో హాజరవుతారు.

రెండేళ్ళకొకసారి తెలంగాణలోని ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో... సమ్మక్క-సారక్క జాతరను జరుపుతారు. ఇది చారిత్రక ప్రాధాన్యం ఉన్న సంబరం. పదమూడో శతాబ్దంలో... నేటి జగిత్యాల మండల ప్రాంతంలోని పొలవాస లేదా పొలస ప్రాంతాన్ని గిరిజన దొర మేడరాజు పరిపాలించేవాడు. ఆయన తన కుమార్తె సమ్మక్కను మేనల్లుడైన మేడారం పాలకుడు పగిడిద్దరాజుకు ఇచ్చి వివాహం చేశాడు. ఆ దంపతులకు సారలమ్మ, నాగులమ్మ, జంపన్న అనే ముగ్గురు సంతానం కలిగారు. రాజ్యవిస్తరణ కాంక్షతో... కాకతీయ ప్రభువైన మొదటి ప్రతాపరుద్రుడు పొలవాస మీద దండెత్తాడు. ఆ దాడిని తట్టుకోలేక మేడరాజు... మేడారంలో అజ్ఞాతవాసం గడిపాడు. మరోవైపు కాకతీయులకు సామంతుడైన పగిడిద్దరాజు కరువు కారణంగా కప్పం కట్టలేకపోయాడు. కప్పం కట్టకపోవడంతోపాటు మేడరాజుకు ఆశ్రయం ఇచ్చినందుకు ఆగ్రహించిన కాకతీయ ప్రభువు మేడారంపై మీద సైన్యంతో విరుచుకుపడ్డాడు. భీకరంగా జరిగిన యుద్ధంలో... మేడరాజు, పగిడిద్దరాజు, సారలమ్మ, నాగులమ్మ, సారలమ్మ భర్త గోవింద రాజులు మరణించారు. ఈ వార్త విన్న జంపన్న సంపెగవాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి ఆవాగు 'జంపన్నవాగు'గా ప్రసిద్ధి చెందింది.

మరోవైపు కాకతీయ సైన్యాన్ని సమ్మక్క వీరోచితంగా ఎదుర్కొని పోరాడింది. అయితే ప్రత్యర్థుల బలం ఎక్కువ కావడంతో... చివరికి ఆమె గాయపడింది. రక్తధారలతో యుద్ధభూమి నుంచి చిలుకలగుట్ట వైపు వెళ్తూ... మార్గమధ్యంలో అదృశ్యమయింది. సమ్మక్క కోసం ఆమె అనుచరులు వెతుకుతూ వెళ్ళారు. వారికి ఆమె కనిపించలేదు కానీ... ఒక పుట్ట దగ్గర పసుపు, కుంకుమ ఉన్న భరిణె దొరికింది. దాన్ని సమ్మక్కగా భావించి... రెండేళ్ళకు ఒకసారి మాఘశుద్ధ పౌర్ణమి రోజున... సమ్మక్క-సారక్క జాతర నిర్వహిస్తున్నారు. వంశపారంపర్యంగా గిరిజనులే పూజారులుగా ఉంటారు. తమ కోర్కెలు తీర్చాలని అమ్మవార్లకు భక్తులు మొక్కుకుంటూ బంగారాన్ని (బెల్లాన్ని) నైవేద్యంగా సమర్పించుకుంటారు. వారి వీరత్వాన్ని స్మరించుకుంటారు.

వందల ఏళ్ళ చరిత్ర కలిగిన ఈ జాతరను నలభై వరకూ చిలకలగుట్ట మీద గిరిజనులు మాత్రమే నిర్వహించేవారు. ఆ తరువాత అన్ని వర్గాల ప్రజలూ పాల్గొంటున్నారు. జనసందోహం ఏటేటా పెరుగుతూ ఉండడంతో జాతరను కొండ కింద నిర్వహించడం మొదలుపెట్టారు. అమ్మవార్లకు చిహ్నంగా గద్దెలు ఏర్పాటు చేశారు. అమ్మవార్లకు ప్రతిరూపాలైన కుంకుమ భరిణెలను జాతర సందర్భంగా గద్దె పైకి తీసుకువస్తారు. ఈ నాలుగు రోజుల జాతరలో తొలిరోజున కన్నెపల్లి నుంచి సారలమ్మను గద్దెపైకి తెస్తారు. ఆ మరునాడు చిలకలగుట్ట నుంచి సమ్మక్క గద్దెపైకి విచ్చేస్తుంది. మూడో రోజున భక్తులకు అమ్మవార్లు దర్శనమిస్తారు. చివరిరోజున అమ్మవార్లు తిరిగి వనప్రవేశం చేయడంతో జాతర ముగుస్తుంది.

ఫిబ్రవరి 21 : కన్నెపల్లి నుంచి సారలమ్మను, పునుగొండ్ల నుంచి పగిడిద్దరాజును, కొండాయి నుంచి గోవిందరాజును గద్దెలపైకి తీసుకువస్తారు.
ఫిబ్రవరి 22: చిలుకల గుట్ట నుంచి కుంకుమభరిణె రూపంలో ఉన్న సమ్మక్కను గద్దెపైకి తెస్తారు.
ఫిబ్రవరి 23: భక్తులు మొక్కులను చెల్లించుకుంటారు.
ఫిబ్రవరి 24: గద్దెలపై భక్తులకు దర్శనమిచ్చిన సమ్మక్క, సారలమ్మ వన ప్రవేశం.
ఫిబ్రవరి 28: తిరుగువారం పండుగ.



● నూతి శివానందం

*సేయ్ కృష్ణ - నవద్వీపే శ్రీ చైతన్య చంద్ర
సేయ్ బలరామ - సంగే శ్రీ నిత్యానంద*

"శ్రీకృష్ణుడు నవద్వీపంలో శ్రీ చైతన్య మహాప్రభువుగా అవతరించగా, వారితో పాటు బలరాముడు నిత్యానంద ప్రభువుగా అవతరించాడ"ని 'చైతన్య చరితామృతం' గ్రంథం చెబుతోంది. పశ్చిమబెంగాల్‌లోని ఏకచక్రధామంలో... 1473లో మాఘ శుద్ధ త్రయోదశి రోజున... హడాయ్ పండిత్, పద్మావతి దంపతులకు శ్రీనిత్యానంద జన్మించారు. ఆ రోజున ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది హరేకృష్ణ భక్తులు శ్రీనిత్యానంద త్రయోదశి మహోత్సవాన్ని (ఈ ఏడాది ఫిబ్రవరి 22న) నిర్వహిస్తారు. శ్రీనిత్యానంద ప్రభువు ఆవిర్భావం గురించి 'వాయుపురాణం'లో బ్రహ్మదేవుడికి శ్రీకృష్ణుడు వివరిస్తూ "నా ప్రప్రథమ పరివ్యాప్త స్వరూపుడు, నాతో అభిన్నుడు అయిన బలరాముడు కూడా నిత్యానందునిగా నాతో పాటు భూలోకంలో అవతరించి... అవధూత శిఖామణిగా ప్రకాశిస్తాడు" అని తెలిపాడు.

> ఆది గురుతత్త్వ స్వరూపమైన శ్రీనిత్యానందుల కృప లేనిదే... శ్రీచైతన్యుల కృపకు ఎవరూ పాత్రులు కాలేరన్నది పూర్వాచార్యుల అభిప్రాయం.

హరేకృష్ణ

త్రేతాయుగాన లక్ష్మణుడిగా శ్రీరామచంద్రుణ్ణి సేవించిన బలరాముడే... కలియుగ ధర్మమైన హరినామ సంకీర్తనా ఉద్యమంలో శ్రీచైతన్య మహాప్రభువుకు తోడ్పడేందుకు శ్రీనిత్యానంద రామునిగా అవతరించారు. అయితే మునుపటి అవతారాలకన్నా ఇది ఎంతో ప్రత్యేకమైనది. ఎందుకంటే... కృష్ణనామాన్ని గానం చేస్తూ, దాన్ని ప్రపంచమంతటా వ్యాపింపజేయడానికి ఒక విశుద్ధ భక్తుడిగా అవతరించడం దీని విశిష్టత. సామాజికంగా ఉన్నతులైనా ఆధ్యాత్మికంగా శోచనీయమైన స్థితిలో ఉన్నవారిని శ్రీ చైతన్యులు ఉద్ధరించి, కొన్నివేల మంది మాయావాద సన్న్యాసులకు విశుద్ధ భక్తిమార్గాన్ని చూపిస్తే... జగాయ్, మాదాయ్ లాంటి మ్లేచ్ఛులపైన సైతం శ్రీనిత్యానందులు కరుణ చూపి, వారిని ఉద్ధరించారు. ఈ ప్రయత్నంలో తన ప్రాణాలకే ప్రమాదం వాటిల్లినా... వెనుకంజ వేయలేదు. పతితులైనవారి మనస్సులను తన అపారమైన కృపతో, ఔదార్యంతో గెలిచి... వారిలో పరివర్తన తీసుకువచ్చారు. ఒక విధంగా శ్రీచైతన్య మహాప్రభువుకు కూడా సాధ్యం కానిది శ్రీనిత్యానంద ప్రభువు సాధించారు. అంతేకాదు... ఏకచక్రపురంలోని బంకిమరాయ మందిరంలో ఉన్న బంకిమరాయ విగ్రహంలో... శ్రీనిత్యానంద ప్రభువు ఐక్యమై, తన లీలలను చాలించారన్నది ఐతిహ్యం. ఆ విగ్రహానికి కుడివైపున జాహ్నవీదేవి, ఎడమవైపున రాధారాణి విగ్రహం దర్శనమిస్తాయి. పరమపవిత్రమైన నిత్యానంద త్రయోదశినాడు... ఆదిగురుతత్త్వమైన శ్రీనిత్యానందుల్ని ఆశ్రయించి అనుసరిద్దాం. శ్రీనిత్యానందుల కృప వల్ల 'హరేకృష్ణ' మంత్రాన్ని జపించేందుకు మరింత శక్తి మనకు లభిస్తుంది.

అవధూత శిఖామణి





శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్, 9396956984

విశేషం



*ప్రథమో హనుమన్నామః ద్వితీయో భీమ ఏవచ
పూర్ణ ప్రజ్ఞ తృతీయస్తు భగవత్కార్య సాధకః*

హనుమ, భీమ అవతారాల తరువాత వైష్ణవతత్త్వ యదార్థ రూపాన్ని పునఃప్రతిష్ఠించడానికి వాయుదేవుడు శ్రీమధ్వాచార్యులుగా అవతరించాడు. ఈ మూడు అవతారాలకు భేదం లేదని మనం గ్రహించాలి. పరమాత్మ, లక్ష్మీదేవి తరువాత సకల దేవతలలో ఉత్తముడు వాయుదేవుడు. అందుకే హరి సర్వోత్తముడైతే... వాయువు జీవోత్తముడు.

వేదప్రతిపాదితమైన వాయుదేవుడి మూడు అవతారాలను... శ్రీమధ్వాచార్యుల శిష్యుడైన శ్రీత్రివిక్రమ పండితాచార్యులు ప్రత్యక్షంగా దర్శించారు. ఒక రోజు మధ్వాచార్యులు ఎప్పటిమాదిరిగానే శ్రీకృష్ణునికి పూజ చేసి, నైవేద్య సమర్పణకు సిద్ధమైనప్పుడు... ఆయన శిష్యులు ద్వాదశ స్తోత్రాన్ని పఠించారు. స్తోత్ర పఠనం పూర్తయింది. నైవేద్య సమర్పణ ముగిసే సమయం వచ్చినా... మధ్వాచార్యులు చేసే ఘంటానాదం ఎంతసేపైనా వినబడలేదు. 'ఎందుకింత ఆలస్యమవుతోంది? ఆచార్యులవారు ఏం చేస్తూ ఉంటారు?' అనే కుతూహలంతో త్రివిక్రమ పండితారాధ్యులు మూసి ఉన్న తలుపును కొద్దిగా జరిపి, సందులోంచీ చూశారు. హనుమ, భీమ, మాధ్వ రూపాలతో శ్రీకృష్ణునికి తన గురువు పూజ చేస్తూ ఉండడం గమనించి... ఆనందాశ్చర్యాలతో మైమరచిపోయారు. ఏ తపస్సు చేసినా లభ్యం కాని ఆ అద్భుత దృశ్యాన్ని దర్శించి... ఆనందబాష్పాలు రాల్చారు. అప్రయత్నంగానే... సహజమైన శ్రేష్ఠకావ్యశైలిలో శ్రీమధ్వాచార్యుల అవతారత్రయాన్ని, రామ, కృష్ణ, వ్యాసత్రయరూపాన్ని వర్ణిస్తూ 'శ్రీహరివాయుస్తుతి'ని జగత్తుకు అందజేశారు. అది విన్న మధ్వాచార్యులు ప్రసన్నులై... స్వయంగా 'నరసింహనఖస్తుతి'ని రచించి, 'శ్రీహరివాయుస్తుతి'ని పఠించే సజ్జనులకు పూర్ణఫలాన్ని అనుగ్రహించారు.

శ్రీమధ్వాచార్యులు బదరీ క్షేత్రానికి వెళ్ళి, నారాయణుణ్ణి దర్శించారు. తన మొదటి గ్రంథమైన 'గీతాభాష్యాన్ని' రచించి, బదరీనాథుడికి సమర్పించారు. అర్జునుడికి శ్రీకృష్ణుడు భగవద్గీతను బోధిస్తున్నప్పుడు... కపిధ్వజుడిగా, భీముడిగా పూర్వావతారాల్లో ఆయన యుద్ధభూమిలో ఉన్నారు. అందుకే పరమాత్ముడే మెచ్చే విధంగా భగవద్గీతకు భాష్యం రాసే భాగ్యం ఆయనకు లభించింది.

శ్రీమధ్వాచార్యుల వ్యక్తిత్వం, తాత్త్వికత ఆయన రచించిన 37 గ్రంథాలలో సంపూర్ణంగా ప్రకటితమైంది. ఈ సంఖ్యలో మూడును, ఏడును కలిపి 'దశం' (పది)గా పరిగణిస్తారు. 'దశమతి' అంటే పూర్ణప్రజ్ఞులు... శ్రీ మధ్వాచార్యులు. అలాగే 'మూడూ ఇంటూ ఏడు' అంటే 21 అనేది మరో సంఖ్య. ఆనాడు మధ్వాచార్యులు తత్త్వవాదంతో పరిశీలించి, ఖండించిన సిద్ధాంతాల సంఖ్య అది. ఆయన బ్రహ్మసూత్రభాష్యం

> ఉడుపిలోని అనంతేశ్వర ఆలయంలో తన శిష్యులకు పాఠాన్ని బోధిస్తూ... అదృశ్యులై, వేదవ్యాసుని బదరికాశ్రమానికి శ్రీమధ్వులు చేరుకున్న రోజు... మాఘ శుద్ధ నవమి. దానినే సద్భక్తులందరూ 'మధ్వనవమి'గా జరుపుకొంటారు. ఆ పుణ్యదినాన శ్రీమధ్వాచార్యుల మహిమలను, ఆయన మానవాళికి అందించిన తత్త్వవాదాన్నీ శక్తి కొద్దీ స్మరిస్తే... శ్రీహరి కరుణకు పాత్రులవుతాము.

ఇరవై రెండవది. ఋగ్వేదంలోని ప్రథమ మండలంలో ఉన్న నలభై సూక్తాలకూ వేదార్థాల్ని వివరిస్తూ వ్యాఖ్యానం రాసి, వేదంలోని ప్రతి శబ్దార్థమూ శ్రీమహావిష్ణువును ఉద్దేశించినదేని మధ్వాచార్యులు నిరూపించారు. వేద, ఉపనిషత్తులలోని పరమాత్ముని తత్త్వజ్ఞాన సందేశాన్ని ప్రపంచానికి అందజేశారు.

జ్ఞాన కార్యసాధకుడు

● మధ్వ ప్రచార పరిషత్, 9440258841

మాజీ ఎమ్మెల్యే 'బిరుదు'కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు, అధికారులు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 15: మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు సంతాప సభ స్థానిక కేరళ మోడల్ స్కూల్‌లో గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ రాజమల్లు పెద్దపల్లి నియోజకవర్గంతోపాటు ఉమ్మడి జిల్లాలో బీసీ నాయకుడిగా సేవలందించారని గుర్తు చేశారు. బిరుదు రాజమలు విగ్రహాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఎమ్మెల్యే విజయరమణారావు, ఆర్టీసీ ఎండీ సజ్జనార్, మాజీ ఎమ్మెల్యేలు జోగు రామన్న, రాంరెడ్డి, కోరుకంటి చందర్, సోమారపు సత్యనారాయణ, దాసరి మనోహర్‌రెడ్డి, టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్ రాకేష్, జడ్పీటీసీ మినుపాల స్వరూప ప్రకాష్‌రావు, ఎంపీపీ బాలాజీరావు, మాజీ ఎంపీపీలు సత్యనారాయణరెడ్డి, వేముల రామ్మూర్తి, సారయ్య, పెద్దపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎల్ రాజయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయిరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ నాయకుడు

గోదావరిఖని, ఫిబ్రవరి 15: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని బుధవారం రాత్రి బీజేపీ నాయకుడు అయోధ్య రవీందర్ కలిశారు. గత 30సంవత్సరాలుగా ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ కార్యకర్తగా పని చేస్తున్న తనకు రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి బీజేపీ టికెట్ ఇవ్వాలని కోరారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో అన్ని వర్గాల ప్రజలతో హిందు సంస్థల ప్రతినిధిగా, సామాజికవర్గాల ప్రజలతో సత్సంబంధాలు ఉన్నాయని, తనకు టికెట్ ఇప్పించాలని కోరారు. ఆయన వెంట బీజేపీ నాయకుల అడిగొప్పుల రాజు, సోను, మధు, బంటి, అనీల్ ఉన్నారు.

వ్యాపార కూడళ్ల అభివృద్ధికి రూ.10కోట్ల నిధులు



వ్యాపార కూడళ్లను పరిశీలిస్తున్న పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 15: గోదావరిఖని ప్రధాన వ్యాపార కూడలి అయిన లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్, మేదరిబస్తీ అభివృద్ధి కోసం రామగుండం ఎమ్మెల్యే డీఎంఎఫ్‌టీ ద్వారా రూ.10కోట్లు మొదటి విడత మంజూరు చేశారు. అభివృద్ధి పనులను ప్రారంభించానికి గురువారం హైదరాబాద్‌కు చెందిన పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం మేయర్ బంగి అనీల్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గోదావరిఖని వ్యాపార కూడళ్ల అభివృద్ధి కోసం రూ.40కోట్లు డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరగా సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయడానికి మొదటివిడతలో రూ.10కోట్లు మంజూరయ్యాయని, పనులు ప్రారంభించడానికి పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ విభాగం శేఖర్, విజయ్, రవి ఆధ్వర్యంలో పరిశీలించామని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. వెంట 42వ డివిజన్ కార్పొరేటర్ బాల రాజ్‌కుమార్, ఈఈ జమీల్, ఏఈ షాబాద్ ఉన్నారు.

పుల్వామ దాడిలో అమరులైన జవాన్లకు నివాళులు



నివాళులర్పిస్తున్న వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు

మార్కండేయకాలనీ, ఫిబ్రవరి 15: పుల్వామ బాంబుదాడిలో అమలరులైన జవాన్లకు వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. వీహెచ్‌పీ నగర కార్యదర్శి మేడగోని రవీందర్, ములుకుంట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ పుల్వామాలో ఉగ్రవాదుల దాడిలో 40మంది జవాన్లు మరణించడం దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఈ కార్యక్రమంలో కాస సత్యనారాయణ, లింగన్న, లక్ష్మయ్య, శ్రీనివాస్, యశ్వంత్, జలేందర్, లడ్డు, కుమార్, శ్రీనివాస్, రాకేష్ పాల్గొన్నారు.

పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

- బస్సు యాత్రను విజయవంతం చేయండి - ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 15: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం రాత్రి మార్కండేయ కాలనీలో జరిగిన రామగుండం అసెంబ్లీ ప్రవాస్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. యావత్ దేశం మూడవసారి ప్రధానిగా నరేంద్ర మోదీని చూడాలని కోరుకుంటోందని, ఈనెల 20 నుంచి బీజేపీ ఆధ్వర్యంలో తలపెట్టిన బస్సుయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు కందుల సంధ్యారాణి, వడ్డేపల్లి రాంచందర్, మహేష్, కందుల పోషం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ కుమార్

ఎట్టకేలకు తుమ్మపొదల నుంచి 'బోటు'కు విముక్తి..

- ప్రారంభానికి ముందే స్క్రాప్ దశకు.. - ఎమ్మెల్యే ఆదేశాలతో జాతరలో పిల్లల వినోదానికి ఏర్పాట్లు



తుమ్మ పొదల నుంచి బటయకు తీసుకవచ్చిన బోటు

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 15: గోదావరి నది ఒడ్డున పర్యటన కోసం ఏర్పాటుచేసిన బోటు ప్రారంభానికి ముందే పాతసామానుగా మారింది. గోదావరి నదికి వరుసగా రెండుసార్లు వరదలు రావడంతో కోటి రూపాయలతో కొనుగోలు చేసిన బోటు గోదావరిఖని వంతెన రాజీవ్ రహదారి తుమ్మ పొదలకు కొట్టుకువచ్చింది. దానిలోని విలువైన సామగ్రి వరదలకు ధ్వంసం కావడం, అధికారులు పట్టించుకోకపోవడంతో దొంగలపాలయ్యి చివరికి స్క్రాప్‌గా మారిపోయింది. సమ్మక్క-సారలమ్మ జాతర పనుల సందర్భంగా ఈప్రాంతంలోని తుమ్మ పొదలు తొలగిస్తుండగా, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ తుమ్మ పొదల్లో చిక్కుకున్న బోటును వెలికితీయాలని సింగరేణి అధికారులకు సూచించగా గురువారం సింగరేణి అధికారులు బోటను క్రేన్ సహాయంతో బయటకు తీసుకువచ్చారు. పని చేయలేని స్థితిలో ఉన్న బోటును స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సూచన మేరకు లైటింగ్ ఏర్పాటు చేసి జాతరలో పిల్లలు ఆడుకోవడానికి తీర్చిదిద్దనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. కోటి రూపాయలతో గత ప్రభుత్వం కొనుగోలు చేసిన బోటు ఒక్కరోజు కూడా గోదావరినదిలో తిరగక చివరికి పిల్లలు ఆడుకునే బొమ్మగా మారడం గమనార్హం.

గ్రామాల్లో ముగిసిన పారిశుధ్య స్పెషల్ డ్రైవ్



నందిమేడారంలో గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ రజిత



మంగపేటలో జీపీ కార్మికులను సన్మానిస్తున్న ఎంపీపీ

ధర్మారం, ఫిబ్రవరి 15: గ్రామాల్లో చేపట్టిన పారిశుధ్య స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం గురువారం ముగిసింది. ఈనెల 7నుంచి 14వరకు ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో అన్ని వీధుల్లో పారిశుధ్యం, మంచినీటి పైపుల లీకేజీలను గుర్తించారు. గురువారం అన్ని గ్రామాల్లో పారిశుధ్య స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గ్రామంలో గ్రామసభలు నిర్వహించి ప్రధాన సమస్యలపై చర్చించారు. వేసవి కాలం రాకముందే మంచినీటి సమస్య ఏర్పడకుండా ప్రత్యేక అధికారులు, పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని ప్రజలు విన్నవించారు. అదేవిధంగా వీధుల్లో చెత్తాచెదారం లేకుండా, డ్రైనేజీలను శుభ్రం చేసేలా చొరవ తీసుకోవాలని వారు వివరించారు. గ్రామంలో ఎక్కడైనా తాగునీటి పైపుల లీకేజీలు, పారిశుధ్యంపై తమకు సమాచారం అందిస్తే తప్పనిసరిగా వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ప్రత్యేక అధికారులు సూచించారు. గ్రామాభివృద్ధిలో గ్రామస్థులు పూర్తి సహాయసహకారాలు అందించాలని వారు కోరారు. దొంగతుర్తిలో ప్రత్యేక అధికారి రమేష్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులను సన్మానం చేశారు. ఈనెల 21నుంచి 24వరకు జరిగే సమ్మక్క జాతరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఏ.రజిత సూచించారు. ఈ గ్రామ సభల్లో ప్రత్యేక అధికారులు, పంచాయతీకార్యదర్శులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రామగిరి, ఫిబ్రవరి 15: గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా పాటించాలని ఎంపీపీ ఆరెల్లి దేవక్క అన్నారు. మండలంలో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని బుధవారంపేట్, కల్వచర్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. అనంతరం గ్రామాల్లో పనిచేసే పారిశుధ్య సిబ్బందికి కొబ్బరినూనె, సబ్బులను అందజేశారు. కార్యక్రమంలో స్పెషల్‌ఆఫీసర్స్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎలిగేడు, ఫిబ్రవరి 15 : మారుమూల గ్రామాలు పచ్చదనం పరిశుభ్రతతో నిండుకొని ఉంటే ప్రజలు ఆయురారోగ్యాలతో ఉంటారని ఎంపీడీవో యాదగిరి భాస్కర్‌రావు అన్నారు. మండలంలోని సుల్తాన్‌పూర్‌లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం ముగింపు గ్రామ సభలో పాల్గొని మాట్లాడారు. ఎంపీపీ తానిపర్తి స్రవంతిమోహన్‌రావు సిబ్బంది, అధికారులను సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వర్ణ, స్పెషల్ ఆఫీసర్స్ కిరణ్‌కుమార్, ఉమాపతి, యశశ్రీ, ఎంపీవో అనిల్‌రెడ్డి, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 15: ఈనెల 7వ తేది నుంచి 15వ తేది వరకు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మంగపేటలో జీపీ పారిశుధ్య కార్మికులు పరిశుభ్రత దోమల నివారణ మందుల పిచికారి తదితర విషయంలో పని గంటల కంటే ఎక్కువ పని చేశారు. ఈ విషయంపై ఎంపీపీ నూనేటి సంపత్ స్పందించి గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సంపత్, ప్రత్యేకాధికారి సునీత, గ్రామకార్యదర్శి రాజ్‌కుమార్, కోఆప్షన్‌సభ్యుడు నారాయణ తదితరులు పాల్గొన్నారు.



సుల్తాన్‌పూర్‌లో పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న అధికారులు



కార్మికులకు ఆటంకాలు కలగకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం వెంకటేశ్వర్లు

రామగిరి, ఫిబ్రవరి 15 : కార్మిక సంఘాలు ఇచ్చిన ఒక్కరోజు టోకెన్ సమ్మెలో సందర్భంగా కార్మికులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు, ఆర్జీ-3 ఇన్‌చార్జి జీఎం రాధాకృష్ణ తెలిపారు. గురువారం జీఎం కార్యాలయంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. టోకెన్ సమ్మెలో సైతం విధులకు హాజరైయ్యే కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసుల సహకారంతో సెక్యూరిటీ సిబ్బంది పటిష్ట చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా గనికి సంబంధించిన వివిధ విభాగాలకు చెందిన సూపర్‌వైజర్స్ సమ్మె వల్లే కలిగే నష్టాలను కార్మిక సంఘాల నేతలకు అవగాహన కల్పించాల్సిందిగా సూచించారు. సమ్మె వల్ల ఒక్కరోజు ఉత్పత్తి నష్టం 85 కోట్ల రూపాయలు ఉంటుందని తద్వారా కార్మికులు తమ వేతనం రూ.18కోట్ల నష్టపోతారనే విషయాన్ని కార్మికులకు వివరించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అధికారులు ఎలీషా, రఘుపతి, చంద్రశేఖర్, పద్మరాజు, ముప్పిడి రవీందర్‌రెడ్డి, లక్ష్మీనారయణ, శ్రీనివాస్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కోల్‌ఇండియా మాదిరిగా పదోన్నతులు ఇవ్వాలి

రామగిరి, ఫిబ్రవరి 15: కోల్‌ఇండియాలో మాదిరిగా పదోన్నతుల ఇవ్వాలని కోరుతూ గురువారం ఆర్జీ-3, ఏపీఏ డివిజన్‌లకు చెందిన అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటరమణకు పలువురు అధికారులు వినతిపత్రం అందజేశారు. సింగరేణిలో పనిచేసే మేనేజర్లు, ఇంజనీర్లు, వెల్ఫేర్ ఆఫీసర్లకు ఇంటర్నల్‌ప్రమోషన్స్ పాలసీ విధానం అమలుచేయాలని కోరారు. ఇంటర్నల్ ప్రమోషన్స్ కోసం దశాబ్దాల కాలంగా సింగరేణి ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసినప్పటికి పట్టించుకున్న దాఖలాలు లేవని, ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, అధికారులు నర్సింహమూర్తి, కుమారస్వామి, షరీఫ్, రమేష్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమ్మెపై మిశ్రమ స్పందన

- నల్లబ్యాడ్జీలకే ఐఎన్‌టీయూసీ పరిమితం - బీఎంఎస్, టీబీజీకేఎస్ దూరం - కార్మికుల్లో కనిపించని ఆసక్తి

గోదావరిఖని, ఫిబ్రవరి 15: జాతీయ కార్మిక సంఘాలు చేపట్టిన దేశవ్యాప్త సమ్మె సింగరేణిలో ప్రశ్నార్థకంగా మారింది. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం నాలుగు జాతీయ కార్మిక సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయి. సమ్మెకు బీఎంఎస్ దూరంగా ఉండగా, సమ్మెను ప్రతిపాదించిన ఐఎన్‌టీయూసీ సింగరేణిలో సమ్మెపై రెండో మార్గాన్ని ఎంచుకున్నది. సమ్మె చేయకుండా కార్మికవర్గం నల్లబ్యాడ్జీలతోనే శుక్రవారం నిరసన తెలపాలని సింగరేణిలోని ఐఎన్‌టీయూసీ ప్రకటించింది. ఏఐటీయూసీ కూడా సమ్మె నిర్వహణపై చూపాల్సిన తీవ్రతను కనబర్చలేదు. సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, ఏఐఎఫ్‌టీయూ సమ్మెను విజయవంతం చేయాలని కార్మికవర్గాన్ని కోరినప్పటికీ, హెచ్ఎంఎస్ కూడా సమ్మెకు మద్దతు తెలిపింది తప్ప సమ్మె ప్రచారంలో భాగస్వామ్యం కాలేదు. దీనికి తోడు ఉత్పత్తి మాసాల సందర్భంలో కార్మికవర్గం సమ్మెలోకి వెళ్లకూడదని సింగరేణి యాజమాన్యం కోరింది. టీబీజీకేఎస్ సమ్మెపై కార్యాచరణ తీసుకోలేదు. దీంతో సింగరేణిలో శుక్రవారం జరగాల్సిన జాతీయ సమ్మెపై కార్మికవర్గం మిశ్రమంగా స్పందిస్తున్నది. దేశంలోని ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ అంశం, కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ జరుగుతున్న సమ్మెను సింగరేణికి అనుసరించేందుకు కార్మిక సంఘాలు ప్రయత్నం చేశాయి. ఈ సమ్మె సందర్భంలో యాజమాన్యానికి పలు కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె నోటీసుల్లో సింగరేణి బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణను కూడా అంశంగా చేర్చాయి. అంతేతప్ప సింగరేణి కార్మికవర్గానికి సంబంధించిన ఆర్థిక డిమాండ్లు, హక్కులకు సంబంధించిన అంశాలు పెద్దగా లేకపోవడంతో కార్మికులు ఆసక్తిల్లో కనిపించడం లేదు. అసంఘటిత కార్మికరంగం, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులు తదితర అంశాలపై డిమాండ్లు ఉన్నప్పటికీ సింగరేణి కార్మికవర్గం ఆ అంశాలను అంత తీవ్రంగా తీసుకున్నట్టు కనిపించడం లేదు. అయితే సమ్మె జరగకుండా చూసేందుకు యాజమాన్యం అన్ని విధాలా ప్రయత్నం చేస్తున్నది. సమ్మె సందర్భంగా సింగరేణిలో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

విద్యార్థులు చదువులో రాణించాలి

ఆర్జీ-1 జీఎం శ్రీనివాస్



కార్యక్రమంలో మాట్లాడుతున్న జీఎం చింతల శ్రీనివాస్



నృత్యం చేస్తున్న విద్యార్థులు

గోదావరిఖని, ఫిబ్రవరి 15: విద్యార్థులు ఉన్నత చదువులు చదవి తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని, ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్, లక్ష్మి విద్యార్థులకు సూచించారు. గురువారం రాత్రి గోదావరిఖని సెక్టార్-2 ఉన్నత పాఠశాలలో 48వ వార్షిక వేడుకలకు వారు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి ఉన్నత పాఠశాలలో నాణ్యమైన విద్యనందించడం జరుగుతుందని, విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు వెళ్లాలని, 10వ తరగతి విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలని కోరారు. సింగరేణి పాఠశాలలకు యాజమాన్యం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. అనంతరం వివిధ క్రీడల్లో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతికకార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల హెడ్ మాస్టర్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, రాంమోహన్, నాగేశ్వర్, మదన్మోహన్, వీరారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి శోభాయాత్ర

ధర్మారం, ఫిబ్రవరి15: ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీలక్ష్మిగోదా సమేతశ్రీవెంకటేశ్వరస్వామి ప్రతిష్ఠ మహోత్సవ శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సముద్రాల అశోక్‌రావు ఇంటి నుంచి విగ్రహాలను పుర వీధుల గుండా భక్తి శ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కోలాటాలు చేశారు. శోభాయాత్ర తర్వాత విగ్రహాలను నూతన ఆలయంలో ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ శోభయాత్రలో భక్తులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 15: పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామంలో శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో చేపట్టిన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట మాజీ సర్పంచ్ చంద శంకర్, చుంచు సదయ్య, కందుల అశోక్, గుమ్మడి ప్రసాద్‌లతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జాతరకు ఆహ్వానం

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి15: మండలంలోని హన్మంతునిపేటలో ఈనెల ఫిబ్రవరి 21 నుంచి నిర్వహించే జాతరకు రావాలని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తనయుడు గడ్డం వంశీకృష్ణను జాతర కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానించారు. భక్తుల సౌకర్యార్థం బోర్‌వెల్ వేయిస్తానని హామీ ఇచ్చినట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. వంశీని కలిసిన వారిలో చైర్మన్ సుధాకర్‌రావు, కొమురయ్య, మేకల లక్ష్మణ్, బండి సతీష్, సంపత్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

'యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి'

ధర్మారం, ఫిబ్రవరి15: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ధర్మారం ఎస్సై2 ఎస్.అశ్విని అన్నారు. గురువారం మండలంలోని నందిమేడారం, దొంగతుర్తి, బొమ్మారెడ్డిపల్లి గ్రామంలో యువతకు మాదకద్రవ్యాలు తీసుకోవడం వలన కలిగే నష్టాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. చదువుకున్న ప్రతి యువకుడు ఉన్నత చదువులపై దృష్టి సారించి ఉద్యోగం పొందాలనే పట్టుదల ఉండాలని సూచించారు. గంజాయి, గుడుంబా, మద్యానికి బానిస కావద్దన్నారు. రోడ్లపై వాహనాలను అతి వేగంగా నడపి ప్రమాదాలకు గురి కావద్దని సూచించారు. తప్పనిసరిగా ప్రతి వాహనాదారుడు హెల్మెట్ ధరించాలని ఆమె సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ఆమె విశదీకరించారు. ఈ సదస్సులో ఏఎస్సైలు వేణుగోపాల్, సాబీర్, పోలీసులు, గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.

అంధుల కోసం విరాళాల సేకరణ

జూలపల్లి, ఫిబ్రవరి 15: మండల కేంద్రంలోని జూపిటర్ ప్రైవేటు పాఠశాల విద్యార్థులు గురువారం అంధుల సంరక్షణ కోసం వాణిజ్య, చిరు వ్యాపారుల నుంచి విద్యార్థులు 40వేల 95 రూపాయల విరాళాలను సేకరించారు. విద్యార్థులు సేకరించిన సొమ్మును జూపిటర్ పాఠశాల కరస్పాండెంట్ అందె కుమార్ సోచ్ అనే స్వచ్ఛంద సంస్థకు అందజేశారు. ఈకార్యక్రమంలో జూపిటర్ పాఠశాల విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

జూలపల్లి, ఫిబ్రవరి 15 : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలోని విద్యార్థులకు కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఎండీ అతిక్‌పాషా ఆధ్వర్యంలో మాజీ శాసనసభ స్పీకర్ స్వర్గీయ దుద్దిల్ల శ్రీపాదరావు జ్ఞాపకార్థం పరీక్ష ప్యాడ్‌లను అందజేశారు. శ్రీపాదరావు అందించిన సేవలను నాయకులు విద్యార్థులకు వివరించారు. మహనీయులను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు అన్ని రంగాల్లో ఎదగాలన్నారు. కార్యక్ర మంలో కాంగ్రెస్‌పార్టి నాయకులు ఎండి గౌస్‌పాషా, చీదురు శ్రీనివాస్, రాజన్న పలువురు ఉపాధ్యాయులు, పాల్గోన్నారు.

'సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం'

మంథని, ఫిబ్రవరి 15: రాజకీయ పార్టీలకు విరాళాల కోసం ఏర్పాటు చేసిన ఎలక్ట్రోల్ బాండ్ల సేకరణ రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల ఉల్లంఘన అని, ఏ పార్టీకి ఎవరు విరాళాలు ఇచ్చిన వివరాలు తెలుసుకునే హక్కు ప్రజలకు ఉన్నదని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం పేర్కొనడాన్ని కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తుందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ఎన్నికల కమిషన్ కో-ఆర్డినేషన్ శశిభూషన్‌కాచే గురువారం వెల్లడించారు. ఎలక్ట్రోల్ బాండ్ల పేరున బీజేపీ పెద్దఎత్తున కార్పొరేట్ కంపెనీల నుంచి విరాళాల సేకరించడంతో క్విడ్ ప్రోకోకు అవకాశం ఏర్పడిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు వల్ల వారి అధికార దుర్వినియోగం బహిర్గతమైందన్నారు.

సామూహిక మరుగుదొడ్లకు తాళం

ఓదెల, ఫిబ్రవరి 15 : ఓదెల మండలం గుంపులలో ప్రభుత్వం నిర్మించిన సామూహిక మరుగుదొడ్లకు తాళం వేసి ఉంటోంది. మరుగుదొడ్డిలో మహిళలు, పురుషులకు ప్రత్యేకంగా నిర్మాణం చేపట్టారు. కానీ మగవారు వెళ్లే వైపు తాళం వేయడంతో మహిళలకు కేటాయించిన వాటినే వాడుకుం టున్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శి పట్టించు కోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.



తాళం వేసి ఉన్న మరుగుదొడ్డి

క్రీడాకారుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి కల్చరల్/సుల్తానాబాద్, ఫిబ్రవరి 15: ఖో-ఖో క్రీడల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకొనుటకు ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి ఏ.సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని సుల్తానాబాద్ గ్రామంలో ఖేలో ఇండియా సెంటర్(ఖోఖో గేమ్) మంజూరు అయిందని, తెలంగాణ క్రీడా ప్రాంగణం సుల్తానాబాద్ (మినీ స్టేడియం) గ్రౌండ్‌లో గెల్లు మధుకర్ యాదవ్ అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారుని ఆధ్వర్యంలో శిక్షణా శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. వివరాలకు సెల్‌నెంబర్ 7995078488లో సంప్రదించాలని పేర్కొన్నారు.

19న ప్రజావాణి

మంథని, ఫిబ్రవరి 15: ఈనెల 19న కలెక్టరేట్‌తో పాటు మంథని తహసీల్దార్ కార్యాలయంలో రెండు చోట్ల ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మంథని డివిజన్ సంబంధించి మంథని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించు ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్, జిల్లా కేంద్రంలో నిర్వహించు ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు పాల్గొంటారని తెలిపారు. మంథని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో డివిజన్ అధికారులు ఉదయం 10గంటల నుంచి అందుబాటులో ఉండాలని కలెక్టర్ తెలిపారు.

బీఐఎస్‌పై అవగాహన సదస్సు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 15: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ (బీఐఎస్)పై గురువారం అవగాహన సదస్సును నిర్వహించారు. అనంతరం నిర్వహించిన పోటీ పరీక్షల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి. అప్పారావు, బీఐఎస్ ఎస్పీ అభిసాయి, రిసోర్సు పర్సన్ జి.ప్రభాకర్, మెంటర్ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.